# తొలివెలుగు

జాతీయ దినపత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక : 188 | శుక్రవారం | 24-7-2026



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.



PUBLISHED FROM : HYDERABAD,KARIMNAGAR, WARANGAL, NALGONDA, KHAMMAM, MAHABOOBNAGAR, NIZAMABAD

వెల: రూ.5/- పేజీలు: 08




## కొడంగల్‌లో ధర్నా రాజకీయ నాటకం

- నీట్‌పై హైదరాబాద్‌లో ఎందుకు ఆందోళన చేయలేదు?
- ప్రధాని మోదీ అంటే రేవంత్‌రెడ్డికి భయం
- కేంద్రంతో సఖ్యతతో ఉంటూ కాంట్రాక్టులు ఇప్పించుకుంటున్నారు
- ప్రజా సమస్యలపై అంశాల వారీగా ఉద్యమాలకు బీఆర్‌ఎస్ సిద్ధం
- త్వరలో పాదయాత్ర తేదీలు, వివరాలు ప్రకటన
- మీడియాతో చిట్‌చాట్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వరంగల్: నీట్ పరీక్ష ఉదంతంపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి ఒక్కసారి కూడా ప్రధాని నరేంద్రమోదీ పేరును ప్రస్తావించడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈ విషయంపై రాజ్ భవన్ ముందు ధర్నా చేయాల్సిందిపోయి

- మిగతా 2వ పేజీలో

## విద్యార్థుల భవిష్యత్తుకే

# తొలి ప్రాధాన్యం..

- పేపర్ లీక్‌లపై కఠిన చట్టానికి సిద్ధమైన కేంద్రం
- నేటి క్యాబినెట్ భేటీలో బిల్లుపై నిర్ణయం
- వేగవంత విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు ఆదేశం
- అర్ధరాత్రి ప్రత్యేక వీడియో సందేశం విడుదల చేసిన ప్రధాని



దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన పోటీ పరీక్షల పేపర్ లీకేజీ వ్యవహారాలపై కేంద్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించేందుకు సిద్ధమైంది. ఈ అక్రమాలకు శాశ్వతంగా చెక్ పెట్టేందుకు ఉద్దేశించిన నూతన బిల్లుపై శుక్రవారం జరిగే కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఆమోదం పొందిన వెంటనే ఈ బిల్లును అతి త్వరలోనే పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టంగా మారుస్తామని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, నిరుద్యోగుల నుంచి వెల్లువెత్తుతున్న ఆందోళనల నేపథ్యంలో ప్రధాని గురువారం అర్ధరాత్రి దాటాక ఒక ప్రత్యేక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. కేవలం 12 గంటల వ్యవధిలోనే ఈ సున్నితమైన అంశంపై ఆయన రెండుసార్లు ప్రకటనలు చేయడం గమనార్హం. పేపర్ లీకేజీలు అనేవి సాధారణమైన పొరపాట్లు కావని, అవి లక్షలాది మంది విద్యార్థుల కష్టాన్ని, వారి తల్లిదండ్రుల నమ్మకాన్ని తీవ్రంగా

- మిగతా 2వ పేజీలో



## తాగు నీటి సరఫరాకు మాస్టర్ ప్లాన్

- హైదరాబాద్ చుట్టూ ఉన్న తాగు నీటి వనరులను అనుసంధానం చేయాలి
- వాటర్‌బోర్డుపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్: క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ) పరిధిలో తాగు నీటి సరఫరాకు సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీతోపాటు విలీన మున్సిపాలిటీల్లోనూ తాగు నీటి సరఫరాలో ఏకరూపత ఉండాలన్నారు. రానున్న 50 ఏళ్ల అవసరాలకు తగినట్లు మాస్టర్ ప్లాన్ ఉండాలని సూచించారు.

2లో



## విజయవాడలో 'ఏపీ అస్త్రం' మొబైల్ యాప్‌ను ఆవిష్కరించిన సీఎం

- ఫ్యూచర్ పోలీసింగ్ సదస్సులో పోలీసు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం
- ఏఐ, డిజిటల్ టెక్నాలజీతో పోలీస్ వ్యవస్థను ఆధునీకరించాలని సూచన
- పోలీసులకు ప్రత్యేక సర్టిఫికేషన్ కోర్సులు ప్రవేశపెట్టాలని ఆదేశం
- రతన్ టాటా హబ్, విట్ యూనివర్సిటీతో పోలీసు శాఖ ఒప్పందాలు

ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు వ్యవస్థను ఆధునిక సాంకేతికతతో పటిష్ఠం చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా విజయవాడ పోలీసులు రూపొందించిన 'ఏపీ అస్త్రం' మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. విజయవాడలోని అంబేడ్కర్ కళా వేదికలో మూడు రోజుల పాటు జరిగిన 'ఏపీ పోలీస్ రిట్రీట్-2026: ఫ్యూచర్ పోలీసింగ్' కాన్ఫరెన్స్ ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల స్వరూపం, నేరస్థుల పద్ధతులు పూర్తిగా మారిపోయాయని, ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసింగ్‌లో టెక్నాలజీ వినియోగం అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు.

- మిగతా 2వ పేజీలో

## విద్యార్థులు ఒంటరి కాదు..

# అండగా ఉంటాం..

- నాలుగు రోజులుగా ఉభయసభల్లో ఒకే తంతు పునరావృతం
- పార్లమెంట్‌లో షరతులు లేని చర్చకు సిద్ధమన్న కేంద్రం
- ప్రధాన్ రాజీనామా తర్వాతే చర్చలకు రెడీ అన్న విపక్షాలు
- పార్లమెంట్ వెలుపల పోటాపోటీ నిరసనలకు దిగిన అధికార, విపక్ష కూటమి ఎంపీలు

న్యూఢిల్లీ: గత నాలుగు రోజులుగా పార్లమెంట్‌లో అవే నినాదాలు, ప్రభుత్వ వైఖరి పదేపదే పునరావృతమవుతున్నాయి. ప్రతిష్టాత్మక పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ ఉదంతంపై ప్రభుత్వం జవాబుదారీ వహించాలని విపక్షపార్టీల ఎంపీలు పార్లమెంట్‌లో గురువారమూ నినదించారు. ఎలాంటి షరతులు లేకుండా చర్చకు సిద్ధమని ప్రభుత్వం స్పష్టంచేసింది. విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశాకే చర్చలకు సుముఖత వ్యక్తంచేస్తామని విపక్ష ఎంపీలు భీషి?మంచుకుని కూర్చున్నారు. దీంతో లోక్‌సభ, రాజ్యసభల్లో నాలుగో రోజూ ప్రతిష్టంభన రాజ్యమేలింది. విపక్షాల ఆందోళనల నడుమ ఇరుసభలూ శుక్రవారానికి వాయిదా పడ్డాయి. ఉభయసభల్లోనూ గురువారం సైతం నీట్ లీకేజీ, విద్యార్థులను కర్కశంగా

- మిగతా 2వ పేజీలో



## సోనమ్ వాంగ్ చుక్ నిరాహార దీక్ష విరమణ



ఢిల్లీ: పర్యావరణ వేత్త సోనమ్‌వాంగ్‌చుక్ నిరాహార దీక్ష విరమింపచేశారు. గురుగ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రిలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సమక్షంలో పండ్ల రసం తాగి దీక్షను విరమించారు. నీట్ లీకేజ్‌లపై బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని గత 26 రోజులుగా సోనమ్ వాంగ్ చుక్ నిరహార దీక్ష చేస్తున్నారు. దీంతో ఆయన ఆరోగ్య పరిస్థితి తీవ్రంగా విషమించింది. ఈ నేపథ్యంలో ఆయన దీక్ష విరమించారు.

2లో

## రెచ్చిపోయిన హౌతీ రెబెల్స్

- ఎర్ర సముద్రంలో సౌదీ అరేబియా చమురు ట్యాంకర్లపై దాడి
- బాబ్ ఎల్--మండెబ్ జలసంధిలో రవాణాను అడ్డుకుంటామని వెల్లడి
- తీవ్రంగా స్పందించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
- మరోసారి దాడికి దిగితే భారీ సైనిక శిక్ష విధిస్తామని హెచ్చరిక

దుబాయ్/కైరో: పశ్చిమాసియా నిప్పుల కొలిమిలా మారిపోయింది. దాడులు, ప్రతిదాడులతో దద్దరిల్లుతోంది. అమెరికా సైన్యం వరుసగా 12వ రోజు సైతం ఇరాన్‌పై వైమానిక దాడులకు పాల్పడింది. మరోవైపు ఇరాన్ అండదండలున్న యెమెన్ హౌతీ తిరుగుబాటుదారులు రెచ్చిపోయారు.



2లో



2లో

## ఉద్యోగ భద్రత లేదు.. సకాలంలో వేతనాలూ లేవు

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ కార్మికులు
- వైఎస్ జగన్‌తో గోడు వెళ్లబోసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ ప్రతినిధులు
- థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వినతి
- కార్మికులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని వైఎస్ జగన్ భరోసా

## మన ఎర్రచందనాన్ని దేశంలో ఎక్కడ దాచినా వదలొద్దు

- ఎర్రచందనం స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపాలని అధికారులకు పవన్ ఆదేశం
- స్మగ్లర్లతో పాటు కింగ్ పిన్‌లపైనా కఠిన చర్యలు తీసుకోవాలని సూచన
- నిఘా కోసం డ్రోన్లు, ఆధునిక టెక్నాలజీ వినియోగించాలని దిశానిర్దేశం
- గత రెండేళ్లలో 1239 మంది అరెస్ట్, 12 మందిపై పీడీ చట్టం ప్రయోగం
- స్మగ్లింగ్ కేసుల్లో 95 శాతానికి పెరిగిన శిక్షల రేటు అని తెలిపిన అధికారులు



2లో

## విద్యార్థుల భవిష్యత్తుకే తొలి ప్రాధాన్యం..

(మొదటి పేజీ తరువాయి)

దెబ్బతీసే ద్రోహమని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేరాలకు పాల్పడిన ప్రధాన నిందితులను ఇప్పటికే అరెస్టు చేసి జైలుకు పంపించామని, విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించినట్లు వివరించారు. విద్యార్థులు తమ అమూల్యమైన విద్యా సంవత్సరాన్ని నష్టపోకూడదనే ఉద్దేశంతోనే తక్షణమే ప్రత్యామ్నాయంగా తిరిగి పరీక్షలు నిర్వహించామని, అయితే అంతటితో తమ బాధ్యత పూర్తయినట్లు భావించడం లేదని స్పష్టం చేశారు. గత రెండున్నర నెలలుగా ఈ వ్యవస్థాగత లోపాలను సరిదిద్దేందుకు అనేక సంస్కరణలు చేపట్టామని, రాబోయే రోజుల్లో మరిన్ని కఠిన చర్యలు ఉంటాయని మోదీ హామీ ఇచ్చారు. నేడు జరగబోయే క్యాబినెట్ భేటీలో ముసాయిదా బిల్లుపై క్షుణ్ణంగా చర్చించి, అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా సమగ్ర చట్టాన్ని తెస్తామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైన అంశమని, ఇందులో ఎలాంటి ఉపేక్ష లేదని ఆ సందేశంలో ప్రధాని స్పష్టం చేశారు.

## ఉద్యోగ భద్రత లేదు.. సకాలంలో వేతనాలూ లేవు

అమరావతి: గ్రామీణ ప్రాంతాలకు తాగు నీరు అందించడంలో కీలకంగా పని చేస్తున్న తుమకు ఉద్యోగ భద్రత, సకాలంలో వేతనాలు లభించడం లేదని గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు వాపోయారు. గురువారం కార్మిక సంఘం ప్రతినిధులు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిసి తమ సమస్యలను వివరించారు. 26 ఏళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7 వేల మంది కార్మికులు సమగ్ర మంచి నీటి పథకాలలో పని చేస్తున్నారని తెలిపారు. థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ విధానం కారణంగా అనేక జిల్లాల్లో కార్మికులకు చెల్లించాల్సిన ఎస్ఎస్ఆర్ రేట్లను తగ్గించి ఇస్తున్నారని వైఎస్ జగన్ దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని ప్రాంతాల్లో 10 నుంచి 20 నెలలుగా వేతనాలు చెల్లించక పోవడంతో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వాపోయారు. నెలల తరబడి జీతాలు అందక పోవడంతో కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. సంవత్సరాలుగా సేవలందిస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను తక్షణమే చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వైఎస్ జగన్‌ను కోరారు. కార్మికులకు నిర్ణిత రేట్ల ప్రకారం వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

## విజయవాడలో 'ఏపీ అస్త్రం' మొబైల్ యాప్‌ను ఆవిష్కరించిన సీఎం

(మొదటి పేజీ తరువాయి)

కేవలం టెక్నాలజీని అందిపుచ్చుకోవడమే కాకుండా, పోలీసు వ్యవస్థ నిర్మాణాన్నే పునః సమీక్షించాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. భవిష్యత్ పోలీసింగ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ లిటరసీ ఆధారంగా నిర్మించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని చంద్రబాబు ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. 2001లోనే తాను ఫ్యూచర్ పోలీసింగ్ వర్క్‌షాప్ నిర్వహించిన విషయాన్ని గుర్తుచేస్తూ, అప్పటితో పోలిస్తే నేడు సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారం, విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు పెరిగాయన్నారు. వీటిని ఎదుర్కొనే సామర్థ్యాన్ని పోలీసు వ్యవస్థ పెంపొందించుకోవాలని సూచించారు. పోలీసుల సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకునేందుకు వారి నైపుణ్యాలను పెంచడంపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐల అనుభవాన్ని గుర్తించి, వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి కీలక బాధ్యతలు అప్పగించాలన్నారు. ఇందుకోసం సోషల్ మీడియా, సైబర్ నేరాలు, గంజాయి-డ్రగ్స్ నిర్మూలన, మహిళలపై నేరాల నియంత్రణ, కన్విక్షన్ రేటు పెంపు వంటి అంశాల్లో ప్రత్యేక సర్టిఫికేషన్ కోర్సులను ప్రవేశపెట్టాలని ఆదేశించారు.

## యువతపై లాఠీ-ఛార్జీ దుర్మార్గం

- రాహుల్, ప్రియాంక గాంధీల అరెస్టుకు నిరసనగా చౌటుప్పల్‌లో కాంగ్రెస్ ధర్నా
- నల్ల బ్యాడ్జీలతో బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు



**తొలివెలుగు, చౌటుప్పల్:** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న నీట్ అభ్యర్థులపై పోలీసుల లాఠీఛార్జ్ చేయడాన్ని ఖండిస్తూ, బాధిత విద్యార్థులకు మద్దతుగా ప్రధాని నివాసం వద్ద ధర్నా నిర్వహించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ చౌటుప్పల్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు, మునుగోడు ఎమ్మెల్యే కొమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు మండల, మున్సిపల్ కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో వలిగొండ రోడ్ చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి బైఠాయించి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, గత పదేళ్లలో 152కు పైగా ప్రశ్నాపత్రాల లీకేజీలు జరిగాయని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థులు, యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని ఆరోపించారు. విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతున్న వారిని అణచివేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెన్నగొని అంజయ్య, వెల్గ రాజశేఖర్ రెడ్డి, బొంగు జంగయ్య గౌడ్, యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ బోర్డు సభ్యుడు గుండు మల్లయ్య గౌడ్, మాజీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, స్థానిక కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, కో-ఆప్షన్ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, ఎండోమెంట్ ఆలయ కమిటీ చైర్మన్లు, షాదీఖానా చైర్మన్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు ఒంటరి కాదు.. అండగా ఉంటాం..

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు చితకబాదడంపై విపక్ష పార్టీల ఎంపీలు ఆందోళనకు దిగారు. గురువారం ఉదయం 11 గంటలకు సభా కార్యక్రమాలు ఆరంభమైన వెంటనే ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ కార్యక్రమాలను అడ్డుకున్నారు. దీంతో రాజ్యసభలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. ఎంత కాలమైనా చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఈ వివాదం తర్వాత తీసుకున్న చర్యలు, విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు తీసుకున్న చర్యలపై చర్చకు అనుమతించాలని ఆయన ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు. 'మేము నిన్న విజ్ఞప్తి చేశాము. ఈ రోజు మీ ద్వారా సభకు మళ్ళీ విజ్ఞప్తి చేయాలనుకుంటున్నాను. మేము కాంగ్రెస్ పార్టీ నాయకులతో, ఇతర ప్రతిపక్ష సభ్యులతో వ్యక్తిగతంగా మాట్లాడాం. మమ్మల్ని వ్యక్తిగతంగా కలిసి మీ సూచనలు పంచుకోవాలని వారిని ఆహ్వానించాం. దయచేసి చర్చను ఎప్పుడు ప్రారంభించాలో నిర్ణయించాలని మేము ప్రతిపక్షాన్ని చేతులు జోడించి అభ్యర్?థస్తున్నాం. అలాకాకుండా షరతులు విధిస్తూ, సాకులు చెబుతూ ఉండే విపక్షం చర్చను తప్పించుకోవాలలని చూస్తోందని అందరూ అర్థం చేసుకుంటారు. లీకేజీ అంశాన్ని రాజకీయం చేయొద్దు"అని కోరారు. రిజిజు ప్రకటనపై రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడారు. నీట్ పేపర్ లీక్‌పై 267వ నిబంధన కింద చర్చ కోరామని, ప్రభుత్వం అందుకు అంగీకరించలేదన్నారు. ప్రధాన్ బాధ్యత వహించి రాజీనామా చేసిన తర్వాతే చర్చలో పాల్గొంటామని స్పష్టం చేశారు. మంత్రి పదవిలో



కొనసాగుతూ అదే అంశంపై సమాధానం ఇవ్వడం సరికాదన్నారు.

### స్పీకర్‌ను విడిగా కలిసిన రాహుల్, అమిత్ షా

లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు మహువా మొయిత్రా, సౌగత రాయ్ తదితరులు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి చర్చించారు. ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉందని, సభా నిబంధనల ప్రకారం చర్చకు అవకాశం కల్పిస్తామని స్పీకర్ హామీ ఇచ్చినట్లు సమాచారం. ఉభయసభలు గురువారానికి వాయిదాపడ్డాక హోం మంత్రి అమిత్ షా సైతం స్పీకర్ బిర్లాతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ రెండు భేటీల్లో చర్చించిన వివరాలు వెల్లడికాలేదు. పార్లమెంట్ ఆవరణలో గురువారం అధికార, ప్రతిపక్ష సభ్యులు పోటాపోటీగా నిరసనలు చేపట్టారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రతిపక్షం ఆందోళన కొనసాగించింది. ప్రధాని నివాసం వద్ద రాహుల్‌గాంధీ తదితర నేతలు నిరసనకు దిగడాన్ని తప్పుబడుతూ ఎన్‌డీఏ ఎంపీలూ పోటీగా నిరసన చేపట్టారు. పార్లమెంట్ ప్రాంగణంలోని మకర్ ద్వార్ వద్ద ఎన్‌డీఏ ఎంపీలు ప్లకార్డులు ప్రదర్శించారు. 'యువతను రెచ్చగొట్టొద్దు. రాహుల్ గాంధీ హోష్‌లోకి రండి'అని ఎన్‌డీఏ ఎంపీ నినదించారు. 'ఇండియా'కూటమి ఎంపీలు 'ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలి', 'ప్రాణాలు కాపాడండి.. నీట్‌ను రద్దు చేయండి', 'బుద్ధి తెచ్చుకోండి', 'వందేమాతరం'అని రాసిన ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్లకార్డు లాక్కునే యత్నం

నిరసనల సందర్భంగా కొంత ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ ఎంపీ ప్రశాంత్ పడోలే చేతిలో ఉన్న ప్లకార్డును ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేన ఎంపీలు లాక్కునేందుకు ప్రయతి?నంచారు. కొద్దిసేపు ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

## సోనమ్ వాంగ్ చుక్ నిరాహార దీక్ష విరమణ

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో ఆయన భార్య గీతాంజలి అంగ్మో కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "నా దీక్షను విరమించినందుకు సంతోషంగా ఉంది. ఈ పోరాటంలో సహకరించిన అందరికీ, నా వెన్నంటి ఉన్న భార్య గీతాంజలికి నా ధన్యవాదాలు" అని తెలిపారు. దేశంలో విద్యా వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాలని మరియు ప్రశ్నాపత్రాల లీకేజీలపై ప్రభుత్వం జవాబుదారీతనం వహించాలని డిమాండ్ చేస్తూ జూన్ 28న ఆయన ఈ నిరాహార దీక్షను ప్రారంభించారు. కాగా కొద్దిసేపటి క్రితమే ప్రధాని మోదీ ప్రకటన విడుదల చేశారు. భవిష్యత్తులో పేపర్ లీకేజ్‌లు కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు సోమవారం కేబినెట్ భేటీలో కీలక బిల్లు ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ఒక వీడియో విడుదల చేశారు. మరోవైపు ఆయనకు మద్దతుగా కాక్రోజ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు తీవ్ర ఉద్రిక్తకరంగా మారాయి. దీంతో పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. దీంతో పలువురు విద్యార్థులకు తీవ్ర గాయాలై పరిస్థితులు ఉద్రిక్తకరంగా మారిన సంగతి తెలిసిందే.

## తాగు నీటి సరఫరాకు మాస్టర్ ప్లాన్

హైదరాబాద్ మహా నగర తాగునీటి సరఫరా, సీవరేజీ బోర్డు పరిధిలోని పనులపై ముఖ్యమంత్రి ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో గురువారం రాత్రి సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం వల్ల తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న తాగు నీటి వనరులను అనుసంధానించాలన్నారు. ఏదేని కారణంతో ఒక చోటి నుంచి నీరు సరఫరా కాకపోయినా మరో చోటి నుంచి వచ్చేలా ఆయా ప్రాంతాలకు సరఫరా చేసేందుకు అనుసంధానత దోహదపడుతుందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఏళ్లుగా పలు ప్రాంతాల్లో మూడునాలుగు రోజులకోసారి తాగు నీరు సరఫరా చేస్తున్నారని, ఇక ముందు ఆ పరిస్థితి ఉండకూడదని సీఎం రేవంత్ చెప్పారు. ఆయా ప్రాంతాలకు రోజు విడిచి రోజు నీరు సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని అధికారులు ఆదేశించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న తాగు నీటి సరఫరా పనులను ఏడాదిన్నరలోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎస్టీపీల నిర్మాణ పనులపై ఆరా తీసిన ఆయన.. వాటి నిర్మాణాన్ని నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా న్యాయపరమైన సమస్యలుంటే త్వరగా పరిష్కరించాలని సూచించారు. తాగు నీటి సరఫరాకు సంబంధించిన పనులు, ఎస్టీపీల నిర్మాణ పనుల ప్రగతిపై ప్రతి నెలా తనకు నివేదిక సమరి?పంచాలన్నారు. పనుల పురోగతి తెలుసుకునేందుకు డ్యాష్ బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో పరిశ్రమలు, వివిధ నిర్మాణ పనుల్లో గ్రే వాటర్ (వినియోగార్హమైన మురుగునీరు) వాడేలా నిబంధనలు రూపొందించి అమలు చేయాలని పేర్కొన్నారు. సమీక్షలో ఎంఏయూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్‌రంజన్, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, జేఎండీ మయాంక్ మిట్టల్ పాల్గొన్నారు.

## కొడంగల్‌లో ధర్నా రాజకీయ నాటకం

కొడంగల్‌లో ధర్నా చేయడం రాజకీయ నాటకమేనన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు, మంత్రులు హైదరాబాద్‌లో ధర్నా చేస్తే ఆయన కొడంగల్‌కు పోయి అక్కడ ధర్నా చేయడం ఏంటని ప్రశ్నించారు. 'మోదీ అంటే రేవంత్‌కు భయం. ఆయన పగలు కాంగ్రెస్‌తో ఉంటాడు. రాత్రయితే బీజేపీతో కలుస్తాడు..'అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు ఒక మూట ఇస్తే బీజేపీకి రెండు మూటలు పంపుతున్నాడని ఆరోపించారు. సీఎంపై ఉన్న పాత కేసులను బీజేపీ ప్రభుత్వం తోడుతుందనే ఉద్దేశంతోనే ప్రధాని పేరును కూడా పలకడానికి భయపడుతున్నాడని విమర్శించారు. గురువారం హనుమకొండ జిల్లా మడికొండలోని సత్యసాయి కన్వెన్షన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్.. మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు.

## మన ఎర్రచందనాన్ని దేశంలో ఎక్కడ దాచినా వదలొద్దు

రాష్ట్రంలో ఎర్రచందనం స్మగ్లింగ్‌ను సమూలంగా నిర్మూలించాలని, అక్రమ రవాణాపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని అత్యంత కఠినంగా అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రానికి చెందిన ఎర్రచందనాన్ని దేశంలో ఏ మూలన దాచిపెట్టినా వదలొద్దని, స్మగ్లర్లతో పాటు వారి వెనుకున్న కింగ్ పిన్‌లపైనా ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో అటవీ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే ప్రత్యేకమైన అటవీ సంపద ఎర్రచందనం. దీనిని కాపాడుకోవడం మనందరి బాధ్యత. ఎర్రచందనం స్మగ్లింగ్‌పై కూటమి ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుంది. నిఘాను పటిష్ఠం చేసేందుకు డ్రోన్ పరిజ్ఞానం, అత్యాధునిక సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి. స్మగ్లింగ్ ముఠాల నెట్‌వర్క్‌ను మూలాలతో సహా పెకిలించాలి" అని అన్నారు. ఇతర రాష్ట్రాల పోలీసు, అటవీ శాఖ అధికారులతో తక్షణమే సమన్వయం పెంచుకోవాలని, దేశంలో ఎక్కడైనా అక్రమ నిల్వలు ఉంటే వాటిని స్వాధీనం చేసుకోవాలని సూచించారు.

## రెచ్చిపోయిన హౌతీ రెబెల్స్

ఎర్ర సముద్రంలో గురువారం సౌదీ అరేబియాకు చెందిన రెండు చమురు ట్యాంకర్లపై దాడి చేసినట్లు ప్రకటించారు. కీలకమైన బాబ్ ఎల్--మండెబ్ జలసంధి గుండా వాణిజ్య రవాణాను అడ్డుకుంటామని స్పష్టంచేశారు. ఎర్ర సముద్రంలో ఎన్సెలియా, లాయ్‌లా అనే రెండు ట్యాంకర్లపై హౌతీలు దాడి చేసినట్లు సబా వార్తా సంస్థ పేర్కొంది. సౌదీ అరేబియాలోని అల్ షుకైఖ్‌కు నైరుతి దిశలో 130 కిలోమీటర్ల దూరంలో ఎర్ర సముద్రంలో ఒక ట్యాంకర్‌ను గుర్తుతెలియని క్షిపణి ఢీకొన్నట్లు తమకు నివేదిక అందిందని యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ తెలిపింది. హౌతీల దాడుల పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. నౌకలపై మళ్లీ దాడులకు పాల్పడితే భారీ సైనిక శిక్ష విధిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టుచేశారు. ""హౌతీలు ఇరాన్ తరపున వ్యవహరించే శక్తులు కాబట్టి వారు మళ్లీ ఇలాంటి చర్యకు పాల్పడితే దానికి ఇరాన్‌నే బాధ్యులను చేస్తాం. ఇరాన్‌తో పాటు హౌతీలపైనా తీవ్రమైన సైనిక చర్య తీసుకుంటాం"అని తేల్చిచెప్పారు. తాజా పరిణామాల వల్ల బ్రెంట్ ముడి చమురు బ్యారెల్ ధర గురువారం 4.3 శాతం పెరిగి 98.16 డాలర్లకు చేరుకుంది. ఈ ఏడాది జూన్ తర్వాత ఇదే అత్యధిక స్థాయి కావడం గమనార్హం. ఇరాక్ ప్రధానమంత్రి అలీ అల్--జైదీ ప్రస్తుతం ఇరాన్‌లో పర్యటిస్తున్నారు. అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చల పునరుద్ధరణ కోసం ఆయన తనవంతు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇరాన్‌లో బుధవారం అర్ధరాత్రి తర్వాత అహ్వాజ్, రామ్‌షిర్, అండిమెష్క్ తదితర ప్రాంతాలపై క్షిపణి దాడులు జరిగినట్లు స్థానిక మీడియా పేర్కొంది. అలాగే ఇరాక్ సరిహద్దులోని షాలమ్‌చెహ్ పట్టణంలో జరిగిన అమెరికా క్షిపణి దాడిలో ఇద్దరు వ్యక్తులు మరణించారు. ఇరాన్ సామర్థ్యాన్ని మరింతగా దెబ్బతీయడానికే దాడులు చేస్తున్నట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. అమెరికా దాడులపై ఇరాన్ సైతం ప్రతీకార చర్యలకు దిగింది. గల్ఫ్‌లో అమెరికా మిత్రదేశాలపై క్షిపణులు, డ్రోన్ల ప్రయోగించింది. ఇంధన మౌలిక సదుపాయాలు, నీటి శుద్ధి కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను మధ్యలోనే కూల్చివేశామని జోర్డాన్, కువైట్ ప్రకటించాయి. ఇరాన్‌పై అమెరికా దాడుల పరంపర కొనసాగుతూనే ఉండడం ప్రపంచ దేశాలకు ఆందోళన కలిగిస్తోంది. ఇరుపక్షాల మధ్య మాటల యుద్ధం మొదలైంది. తమ మౌలిక సదుపాయాలపై అమెరికా జరిపే దాడులకు సంబంధించి 'కంటికి కన్ను'విధానాన్ని అనుసరిస్తామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి పేర్కొన్నారు. దీనిపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఘాటుగా బదులిచ్చారు. తమ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానం కూడా 'కంటికి కన్ను'అని తేలిచెప్పారు. వారికి(ఇరాన్) బుద్ధి వచ్చేంత వరకు ప్రతి రాత్రీ దాడుల తీవ్రత పెరుగుతూనే ఉంటుందని స్పష్టంచేశారు.



## ప్రధాని మోదీ తక్షణమే రాజీనామా చేయాలి

- ఉమ్మడి వరంగల్ జిల్లా సర్పంచుల ఫోరం కన్వీనర్ కమలాకర్ డిమాండ్

**తొలివెలుగు, చిన్నగూడూరు:** నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా సర్పంచుల ఫోరం కన్వీనర్ గునిగంటి కమలాకర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని దాశరథి సెంటర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంతో విద్యార్థుల భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై నిరసన తెలుపుతూ ప్రధాని నివాసం వద్ద శాంతియుతంగా ధర్నా చేపట్టిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ కార్యకర్తలపై రాళ్లదాడికి పాల్పడటం శోచనీయమన్నారు. ఆందోళన చేస్తున్న రాహుల్ గాంధీని పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నగూడూరు సర్పంచ్ రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సుదగాని నాగేష్, నాయకులు పట్లా కిరణ్, బిక్కు నాయక్, గంధసిరి ఉపేందర్, కంచరనపల్లి వెంకన్న, దాసరి శ్రీను, గాడిపెల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీపై కాంగ్రెస్ ఆరోపణలు సరికావు

- భాజపా జిల్లా నాయకుడు మాచర్ల నవీన్



**తొలివెలుగు, చిన్నగూడూరు:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ నాయకులు అనవసర ఆరోపణలు చేయడం సరికాదని భాజపా జిల్లా నాయకుడు మాచర్ల నవీన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని దాశరథి సెంటర్‌లో భాజపా శ్రేణులతో కలిసి ఆయన నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మూడు రోజులుగా ఢిల్లీ కేంద్రంగా ప్రధాని మోదీపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న నిరాధార ఆరోపణలను వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం నిరుపేదల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తుంటే, కాంగ్రెస్ నాయకులు ఓర్వలేక అపనిందలు వేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో బడుగు, బలహీన వర్గాలకు ఉచిత సన్నబియ్యం, వంటగ్యాస్ సబ్సిడీతో పాటు మరెన్నో సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో భాజపా జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కొప్పుల శ్రీను, లక్ష్మణ్, జంపాల నాగన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీఛార్జీని ఖండిస్తున్నాం

- కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి: కట్టెల లింగస్వామి

**తొలివెలుగు, చౌటుప్పల్:** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సామాజిక ఉద్యమకారుడు కట్టెల లింగస్వామి అన్నారు. గురువారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వలిగొండ రహదారిలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాస్వామికవాదుల ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో నీట్ సహా వివిధ పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు వరుసగా లీక్ అవడం వెనుక కేంద్ర విద్యాశాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. గతంలోనూ పలుమార్లు లీకేజీలు జరిగాయని, ఇప్పటివరకు దాదాపు 150 పరీక్షల పేపర్లు లీక్ కావడం దారుణమన్నారు. న్యాయమైన డిమాండ్లతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికే విఘాతమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రధాని మోదీ స్పందించి విద్యాశాఖ మంత్రి చేత రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. 'సేవ్ ఇండియా – సేవ్ డెమోక్రసీ' నినాదంతో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామికవాదులు బోయ సుధాకర్, బోయ కుమార్, పండి రాకేష్, ఏర్పుల సాయి, చేకూరి బాబు, కట్టెల ప్రదీప్, మాదాను ఆకాష్, ఎర్ర బాబు, ఓర్సు గణేష్, దోర్నాల వంశీ తదితరులు పాల్గొన్నారు.





## రాహుల్, ప్రియాంక గాంధీల అరెస్టుకు నిరసనగా రాస్తారోకో

- పేద విద్యార్థుల జీవితాలతో మోదీ ప్రభుత్వం చెలగాటం: నమిల మహేందర్ గౌడ్



**తొలివెలుగు, రాజాపేట:** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టును ఖండిస్తూ గురువారం రాజాపేటలోని మహాత్మాగాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రేణికుంట పిఎసిఎస్ చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్ మాట్లాడుతూ నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలకు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్లక్ష్యానికి బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ వెంటనే రాజీనామా చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రిని పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రాహుల్, ప్రియాంక గాంధీలను పోలీసులు రోడ్లపై ఈడ్చుకెళ్తూ దుర్భాషలాడటం, నెట్టివేయడం భాజపా అరాచక పాలనకు నిదర్శనమన్నారు. కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. నీట్ పరీక్షను వెంటనే రద్దు చేసి, నూతన పారదర్శక సంస్థ ద్వారా తిరిగి పరీక్ష నిర్వహించాలని కోరారు. అంతకుముందు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భారీ ప్రదర్శన నిర్వహించి గాంధీ కూడలి వద్ద బైఠాయించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగ పెంటయ్య గౌడ్, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ మెండు భాస్కర్ రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రంగా నరేష్ గౌడ్, చల్లూరు ఉపసర్పంచ్ బొంత సుధాకర్, రాజాపేట ఉపసర్పంచ్ నమిల కేదారి గౌడ్, మాడిశెట్టి సురేష్, డాక్టర్ చింతల రవి, పెద్దోళ్ల ప్రభాకర్, ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్, మాలోత్ విఠల్ నాయక్, రావుల హరిబాబు, మోతుపల్లి ప్రవీణ్, మాజీ సర్పంచ్ గాడిపల్లి శ్రవణ్, మెండు ఉపేందర్ రెడ్డి, పిట్టల జయరాములు, వస్పరి సుధాకర్, బీరు లవన్, పి. మహేష్, పోచయ్య, బింగి రమేష్, భైర పాండు తదితరులు పాల్గొన్నారు.

## సమృద్ధిగా వర్షాలు కురవాలి.. రైతన్నలు సుభిక్షంగా ఉండాలి





- యాదాద్రిలో వరుణ యాగం నిర్వహించిన మంత్రి కొండ సురేఖ, విప్ బీర్ల అయిలయ్య
- ఆలయాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ప్రభుత్వ విప్

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో నిర్వహించిన వరుణ యాగం కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ సాగిన పూర్ణాహుతి క్రతువులో వారు భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. అంతకుముందు స్వామివారిని దర్శించుకున్న నేతలకు ఆశీర్వచన మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు వేదాశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు, లడ్డూలను అందజేసి సత్కరించారు. అనంతరం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ... వరుణ యాగం అత్యంత పవిత్రమైన కార్యక్రమమన్నారు. రాష్ట్రంలో చెరువులు, జలాశయాలు నిండి రైతులు సుభిక్షంగా ఉండేలా స్వామివారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో యాదాద్రిని ఆధ్యాత్మిక క్షేత్రంగా మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## గురుకులంలో ముగిసిన 'బాయ్స్ ఫర్ చేంజ్'

- 196 మంది విద్యార్థులకు పది రోజుల పాటు శిక్షణ: ప్రిన్సిపాల్ పి.సుధాకర్
- లింగ సమానత్వం, మానసిక ఆరోగ్యంపై అవగాహన

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో పది రోజుల పాటు నిర్వహించిన "బాయ్స్ ఫర్ చేంజ్" కార్యక్రమం గురువారంతో విజయవంతంగా ముగిసింది. ఇందులో మొత్తం 196 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ శిక్షణలో విద్యార్థులకు లింగ సమానత్వం, మానసిక ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం, భావోద్వేగ నియంత్రణ, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలపై సమగ్ర అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో సమానత్వ భావనను, సామాజిక బాధ్యతను పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. జీవన నైపుణ్యాలు, సమూహ కార్యకలాపాలపై నిర్వహించిన సదస్సులు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.సుధాకర్ మాట్లాడుతూ... విద్యార్థుల సమగ్ర వికాసానికి, నైతిక విలువల నిర్మాణానికి ఇటువంటి శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన ఉపాధ్యాయ బృందాన్ని, ఆసక్తిగా పాల్గొన్న విద్యార్థులను ఆయన అభినందించారు.



## బస్సు యాత్రను విజయవంతం చేయండి

- కల్లు గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పాండవుల లక్ష్మణ్ గౌడ్

**తొలివెలుగు, రాజాపేట:** కల్లుగీత వృత్తి రక్షణ, హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న బస్సు యాత్ర ప్రదర్శన సభను జయప్రదం చేయాలని రాజాపేట మండల కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు పాండవుల లక్ష్మణ్ గౌడ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో యాత్రకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ.. గీత వృత్తి రక్షణ కోసం పోరాడి అమరులైన నాయకుల ఆశయ సాధనకు ఈ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఆగస్టు 2న మానుకోట (మహబూబాబాద్) జిల్లా కేంద్రంలో ప్రారంభమయ్యే బస్సు యాత్ర ఆగస్టు 18న సర్దార్ సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో ముగుస్తుందన్నారు. ఈ యాత్ర ఆగస్టు 9న భువనగిరి పట్టణానికి చేరుకోనుందని తెలిపారు. ఆ రోజున పట్టణంలో బస్సు యాత్ర ప్రదర్శన, వినాయక చౌరస్తా వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. గీత కార్మికులందరూ పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మహేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బత్తిని సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షుడు భీమగాని గోపాల్ గౌడ్, నాయకులు బుడిగ పెంటయ్య గౌడ్, సిల్వేరు బాలరాజు గౌడ్, రంగా నరేష్ గౌడ్, నమిలే కేదార్ గౌడ్, బుడిగే కనకయ్య, కోరుకొప్పుల వెంకటేష్ గౌడ్, పాండవుల సాయిప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# మొక్కలు నాటి.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

- నమిలలో రైతులు, గ్రామస్థులకు మొక్కల పంపిణీ
- ప్రతి మొక్కను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత: సర్పంచ్ పులి రాజు ముదిరాజ్

**తొలివెలుగు, రాజాపేట:** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, నాటిన ప్రతి మొక్కను బాధ్యతగా సంరక్షించాలని నమిల గ్రామ సర్పంచ్ పులి రాజు ముదిరాజ్ పిలుపునిచ్చారు. గురువారం రాజాపేట మండలంలోని నమిల గ్రామంలో రైతులు, గ్రామస్థులకు నర్సరీలో పెంచిన పూలు, పండ్లతో పాటు నీడనిచ్చే వివిధ రకాల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణ సమతుల్యతను కాపాడాలంటే ప్రతి కుటుంబం కనీసం కొన్ని మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న హరితహారం లక్ష్యాలను విజయవంతం చేయడంలో గ్రామ ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొని మొక్కలను స్వీకరించారు.

# బాధిత కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ అండ

- దూది వెంకటాపురంలో 50 కిలోల బియ్యం పంపిణీ
- ఆపదలో ఉన్న కుటుంబాలకు సేవలందించడం అభినందనీయం: సర్పంచ్ నడిమింటి నరేష్



**తొలివెలుగు, రాజాపేట:** ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడంలో బీర్ల ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని పలువురు కొనియాడారు. రాజాపేట మండలంలోని దూది వెంకటాపురం గ్రామానికి చెందిన లింగాల గణేష్ ఇటీవల అకాల మరణం చెందగా, ఈ విషయం తెలుసుకున్న బీర్ల ఫౌండేషన్ ప్రతినిధులు గురువారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా గణేష్ మృతికి సంతాపం తెలియజేసిన ఫౌండేషన్ ప్రతినిధులు, కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం కుటుంబానికి తక్షణ ఉపశమనంగా బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యాన్ని ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నడిమింటి నరేష్ మాట్లాడుతూ.. కష్టకాలంలో నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి నిత్యావసర సాయం అందించిన బీర్ల ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు. సమాజంలో ఆపదలో ఉన్నవారికి సేవా దృక్పథంతో సహాయం చేయడం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మంగ కృష్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోరుకొప్పుల శ్రీధర్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు, గ్రామ ప్రముఖులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రామన్నపేట సీఐగా మోలుగురి రవి బాధ్యతల స్వీకరణ

- ప్రజలకు అందుబాటులో ఉంటా: నూతన సీఐ
- శాంతిభద్రతల పరిరక్షణే ముఖ్యం

**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట పోలీస్ సర్కిల్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా మోలుగురి రవి గురువారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ?బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీఐ మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండే ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు మొదటి ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు సత్వర న్యాయం అందించడం, పోలీసు-ప్రజల మధ్య సత్సంబంధాలు పెంపొందించడమే తన లక్ష్యమని, ఎలాంటి సమస్యలున్నా ప్రజలు నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని కోరారు.



# భూ రీ-సర్వేకు రైతులంతా సహకరించాలి





- పైలట్ ప్రాజెక్ట్‌గా అల్లాపురం ఎంపిక: తహసీల్దార్ వీరబాయి

**తొలివెలుగు, చౌటుప్పల్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ సర్వే, రీ-సర్వే కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని అల్లాపురం గ్రామంలో గురువారం విస్తృత అవగాహన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వీరబాయి మాట్లాడుతూ.. పైలట్ ప్రాజెక్టు కింద మండలంలోనే అల్లాపురం గ్రామం ఎంపిక కావడం శుభపరిణామమన్నారు. సర్వే ప్రారంభించే ముందుగా గ్రామంలోని రెవెన్యూ భూముల చుట్టూ బౌండరీలు (సరిహద్దులు) ఏర్పాటు చేసి, అనంతరం సమగ్ర సర్వే చేపడతామని వివరించారు. ఈ ప్రక్రియ వేగవంతంగా, పారదర్శకంగా పూర్తయ్యేందుకు ప్రతి ఒక్క రైతు అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన గ్రామ సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి మాట్లాడుతూ.. పైలట్ ప్రాజెక్టుగా తమ గ్రామం ఎంపిక కావడంపై సంతోషం వ్యక్తం చేస్తూ, ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయడానికి రైతులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**భూగర్భ జలాల పెంపునకు ఇంకుడు గుంతలు నిర్మించాలి: ఎంపీడీఓ శ్రీలత**

అనంతరం 'జలశక్తి' కార్యక్రమంలో భాగంగా గ్రామానికి విచ్చేసిన ఎంపీడీఓ శ్రీలత క్షేత్రస్థాయి పరిశీలన (ఫీల్డ్ విజిట్) నిర్వహించారు. భూగర్భ జలాలు పెరిగేలా రైతులు ఊటకుంటలు, పంట కుంటలు నిర్మించుకోవాలని, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తొలిసారి గ్రామానికి విచ్చేసిన ఎంపీడీఓ శ్రీలతను సర్పంచ్ మంజుల రెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బాణాల రాంరెడ్డి, ఉపసర్పంచ్ బోయిని లింగస్వామి యాదవ్, వార్డు సభ్యులు యంజాల లింగస్వామి, యంజాల శ్రీకాంత్, యంజాల అమృత, భూతం లింగస్వామి యాదవ్, సర్వేయర్, ఇరిగేషన్ ఏఈ, గ్రామ కార్యదర్శి, గ్రామ ప్రజలు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ అగ్ర నేతల జన్మదిన వేడుకలు

- మీనాక్షి నటరాజన్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలకు నేతల శుభాకాంక్షలు
- కేక్ కట్ చేసి పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్ష
- రామన్నపేట జెడ్పీ గెస్ట్‌హౌస్‌లో ఘనంగా నిర్వహణ



**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ విశ్రాంతి భవనంలో ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్ రెడ్డిల జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కేక్ కట్ చేసి, ఇరువురు నేతలకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న జగన్మోహన్ మాట్లాడుతూ... ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, కార్యకర్తలు సమష్టిగా కృషి చేసి పార్టీ బలోపేతానికి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ జమీరుద్దీన్, డీసీసీ కార్యదర్శి కొత్తపల్లి అబ్రహం కుమార్, డీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి గుండాల నరసింహ, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టే సంతోష్ కుమార్, మార్కెట్ వైస్ చైర్మన్ సింగిరెడ్డి మల్లారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బిక్షం రెడ్డి, పూస బాలకిషన్, కొమ్మాయిగూడెం సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి, ఎన్నారం సర్పంచ్ ఎలుగాపురి జనని నర్సింగ్ రావు, బాచుప్పల సర్పంచ్ మాదేవి భూపాల్, రామన్నపేట ఉప సర్పంచ్ మోటే రమేష్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మునుగోడు ఎమ్మెల్యే కార్యాలయం ముట్టడి

**తొలివెలుగు, చౌటుప్పల్:** గత ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.10 వేల కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం చౌటుప్పల్ పట్టణంలోని మునుగోడు శాసనసభ్యుల (ఎమ్మెల్యే) కార్యాలయాన్ని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ముట్టడించారు. ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో కార్యాలయం గేటుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లావుడ్యా రాజు మాట్లాడుతూ... ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాలయాపన చేయగా, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫీజులు విడుదల చేయకుండా జీవో 7, 8 తెచ్చి విద్యార్థుల నుంచే వసూలు చేయాలని చూడటం సరికాదన్నారు. సర్టిఫికెట్లు రాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు విడుదల చేయకపోతే ప్రజాప్రతినిధులను గ్రామాల్లో తిరగకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఇందురాణి, జిల్లా ఉపాధ్యక్షుడు ఇర్ల రాహుల్, సహాయ కార్యదర్శులు తిగుళ్ల శ్రీనివాస్, పుట్టల ఉదయ్, సృజన, జిల్లా కమిటీ సభ్యులు ప్రకాష్, ప్రసన్న, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



# రాహుల్‌గాంధీ అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ ధర్నా

- నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీపై కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ధ్వజం
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్

**తొలివెలుగు, రామన్నపేట:** నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో విద్యార్థులకు మద్దతుగా ఢిల్లీలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ రామన్నపేట పట్టణంలోని జూనియర్ కళాశాల సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న జగన్మోహన్ పాల్గొని కేంద్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా విమర్శించారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన నీట్ పరీక్షల్లో జరిగిన ప్రశ్నాపత్రాల లీకేజీపై ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందని ఆయన అన్నారు. విద్యార్థులకు అండగా నిలుస్తున్న కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు, ఏఐసీసీ నాయకత్వం, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నీట్ అక్రమాలపై ప్రశ్నిస్తున్న విద్యార్థులు, యువతపై లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే చర్య అని మండిపడ్డారు. విద్యార్థులకు మద్దతుగా ధర్నా చేస్తున్న రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తూ ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై లాఠీచార్జ్ చేయడం, రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులపై దాడేనని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రశ్నాపత్రాల లీకేజీలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలకు స్వస్తి పలికి ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని ఆయన కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ జమీరుద్దీన్, డీసీసీ కార్యదర్శి కొత్తపల్లి అబ్రహం కుమార్, డీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి గుండాల నరసింహ, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టే సంతోష్ కుమార్, మార్కెట్ వైస్ చైర్మన్ సింగిరెడ్డి మల్లారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నంద్యాల బిక్షం రెడ్డి, పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నమిల క్రాస్ రోడ్డు వద్ద పోలీసుల 'నాకాబందీ'





- రాజాపేట మండలంలో పోలీసుల విస్తృత నాకాబందీ
- డ్రైవింగ్ లైసెన్సులు, వాహన పత్రాల పరిశీలన.. నిబంధనలు పాటించాలని సూచన

**తొలివెలుగు, రాజాపేట:** పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం నమిల క్రాస్ రోడ్డు వద్ద గురువారం పోలీసులు విస్తృతంగా నాకాబందీ నిర్వహించారు. రోడ్డు భద్రతను మెరుగుపరచడం, నేరాల నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచే లక్ష్యంతో ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ లింగారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ జి. ప్రభాకర్ నాయుడు, హెడ్ కానిస్టేబుల్ యాదగిరి, ఇతర పోలీసు సిబ్బంది వాహనాలను నిలిపివేసి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ద్విచక్ర, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాలతో పాటు ఇతర వాహనాల రికార్డులను పరిశీలించారు. డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, బీమా పత్రాలు, కాలుష్య నియంత్రణ (పీయూసీ) ధ్రువపత్రాలను తనిఖీ చేసి, అవసరమైన చోట వాహనదారులకు సూచనలు చేశారు. తనిఖీల సందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీటుబెల్ట్ వినియోగించాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. అదేవిధంగా వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని, నంబర్ ప్లేట్లు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. పోలీసులు మాట్లాడుతూ.. ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని, నేరాల నియంత్రణతో పాటు రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ఇటువంటి నాకాబందీ కార్యక్రమాలను తరచూ నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ట్రాఫిక్, మోటారు వాహన చట్ట నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.



## మృతురాలి కుటుంబానికి 'జైశ్రీరామ్ ఫౌండేషన్' చేయూత

- రూ.5 వేల ఆర్థిక సాయం అందజేత
- పాల్గొన్న రాజాపేట సర్పంచ్ కోయ మధు

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేటలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఎర్రగోకుల లలిత కుటుంబానికి గురువారం 'జైశ్రీరామ్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా 184వ సాయంగా ఈ మొత్తాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజాపేట సర్పంచ్ కోయ మధు, స్థానిక నాయకులు దాచేపల్లి రాజు, చెలమనపల్లి లక్ష్మణ్, చిగుళ్ల బీరయ్య, దాచేపల్లి శ్రీనివాస్, సాధనబోయిన శంకర్, బిర్రు సురేష్, మాల్యాల భారత్, దేశ్‌పాండే ప్రసాద్, సట్టు రవీందర్, కోయ ఉపేందర్, చింతల సాయి, నర్సింహులు, రాజు, చంద్రయ్య, సత్తయ్య, ఎర్రగోకుల జస్వంత్, చెల్మడి వెంకటేష్, మృతురాలి కుటుంబ సభ్యులు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## చేనేత అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయాలి

- స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్‌ను కలిసిన తడక రమేష్
- త్వరలోనే పోచంపల్లిలో పర్యటిస్తానన్న అధికారి



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** చేనేత పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయాలని కోరుతూ జాతీయ మెరిట్ సర్టిఫికెట్ గ్రహీత తడక రమేష్ గురువారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో చేనేత జవుళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ చీఫ్ సెక్రటరీ) సవ్యసాచి ఘోష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను చేనేత శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పోచంపల్లిలోని చేనేత రంగానికి సంబంధించిన వివిధ అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. దీనిపై ప్రత్యేక సీఎస్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే పోచంపల్లిని సందర్శించి పరిశ్రమ స్థితిగతులపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేస్తానని, చేనేత అభివృద్ధికి తగిన కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చేనేత శాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ రాంగోపాల్ రావు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి బర్త్‌డే వేడుకలు

- నేతాజీ చౌరస్తా వద్ద కేక్ కట్ చేసిన మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ శ్రేణులు
- ప్రజలకు అందుబాటులో ఉండే నేత చామల: తడక వెంకటేశ్వర్లు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం పోచంపల్లి పురపాలక కేంద్రంలో మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక నేతాజీ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, జిల్లా నాయకుడు పాక మల్లేష్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ చామల నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రస్థాయి సమస్యలను పార్లమెంట్ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చొరవ చూపుతున్నారని తెలిపారు. ప్రజలకు, కార్యకర్తలకు ఆపద వస్తే 'నేనున్నానంటూ' ముందుండి ఆదుకునే మనస్తత్వం ఆయనదని, రానున్న రోజుల్లో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. మండల, పట్టణ కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు ఉప్పునూతుల వెంకటేష్ యాదవ్, భారత్ లవ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కాసుల అంజయ్య గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గ్యార సందీప్, ఆర్‌టీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఏర్పుల శ్రీనివాస్, గ్రంథాలయ చైర్మన్ చింతకుంట్ల కృష్ణారెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ చెగూరి ప్రభాకర్, గ్రామ శాఖ అధ్యక్షులు సింగం లింగస్వామి, గుడిసె నాగభూషణం, మండల నరసింహ, గుండ్ల మహేష్, వారాల రామచంద్రరెడ్డి, కొట్టం కరుణాకర్ రెడ్డి, వంగూరి పాండు, నల్ల నాగేష్, నోముల బసవరెడ్డి, కుక్క కుమార్, అరుణ్, రావుల అనిల్, జినుకల జయసూర్య, చేరాల మహేందర్, గంగాదేవి మహేష్, చిలుకల శివ, బొక్క రామకృష్ణారెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ ధర్నా

- ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జీని ఖండించిన నాయకులు
- కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్

**తొలివెలుగు, ఆత్మకూరు (ఎం) :** ఢిల్లీలో నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై విద్యార్థులు చేపట్టిన శాంతియుత నిరసనపై జరిగిన లాఠీచార్జిని, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టును నిరసిస్తూ ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలోని రాయగిరి – మోత్కూర్ ప్రధాన రహదారిపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై ప్రశ్నిస్తున్న వారిపై లాఠీచార్జ్ చేయడం, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం నిరసనలను అణిచివేసే ప్రయత్నం చేయడం తగదని అన్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తును కాపాడేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మార్కెట్ డైరెక్టర్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్యాక్స్ చైర్మన్లు, డైరెక్టర్లు, దేవాలయ కమిటీ చైర్మన్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ శాఖల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, బూత్ ఎన్రోలర్లు, బీఎల్ఏలు, బీసీ సెల్, ఓబీసీ సెల్, మైనారిటీ సెల్, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా తాటి నరసింహ

- నూతన కార్యవర్గాన్ని ప్రకటించిన మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు
- ఆలయ నూతన కమిటీ సభ్యులకు సన్మానం




**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి పురపాలక కేంద్రంలోని పద్మనగర్ కాలనీలో వెలసిన స్వయంభు బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయ నూతన కార్యవర్గాన్ని గురువారం మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్‌లు సంయుక్తంగా ప్రకటించారు. ఆలయ నూతన అధ్యక్షుడిగా (చైర్మన్) తాటి నరసింహ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా కుడికాల బిక్షపతి, ఉపాధ్యక్షులుగా అమృతం బాలరాజు, గంజి కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్, కోశాధికారిగా భోగా అయిన, సహాయ కార్యదర్శిగా చెడుతూపు నాగేష్‌లతో పాటు సభ్యులుగా తంగళ్ళ మల్లేష్, భోగా నరసింహ, గోరుగంటి రాజు, పసునూరి యాదగిరి, భోగా నవభారత్, చిక్క వెంకటేష్, పెద్దల అశోక్, చిక్క రూపలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీని మున్సిపల్ చైర్మన్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాక మల్లేష్ యాదవ్, కొట్టం కరుణాకర్ రెడ్డి, వంగూరి పాండు తదితరులు పాల్గొన్నారు.

## లోకమాన్య తిలక్ ఆశయాలు ఆదర్శనీయం

- పోచంపల్లిలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ
- ఆసుపత్రి రోగులకు పండ్ల పంపిణీ చేసిన యువజన సంఘం

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో గణేష్ గంగాధర్ తిలక్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వతంత్ర సమరయోధుడు లోకమాన్య బాలగంగాధర్ తిలక్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై తిలక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారత స్వాతంత్ర్య ఉద్యమంలో తన ఆలోచనలతో దేశ ప్రజలందరినీ ఐక్యం చేసేందుకు నిరంతరం కృషి చేసిన గొప్ప స్వతంత్ర సమరయోధుడు బాలగంగాధర్ తిలక్ అని కొనియాడారు. ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం యూత్ అసోసియేషన్ సభ్యులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (పీహెచ్‌సీ) చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ దేవరాయ కుమార్, సంఘం అధ్యక్షుడు సకినాల కనకయ్య, ప్రధాన కార్యదర్శి భోగ యాదగిరి, కోశాధికారి కైరం కొండ మురళి, గౌరవ అధ్యక్షుడు భారత్ ఆంజనేయులు, సంఘం సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# బాలికల వసతి గృహంలో మంత్రి, విప్ ఆకస్మిక తనిఖీ





- భోజన నాణ్యత, వసతులను పరిశీలించిన మంత్రి కొండ సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య
- విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం: మంత్రి

**తొలివెలుగు, యాదగిరిగుట్ట :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వసతి గృహంలో విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు, ఆహార నాణ్యత, పారిశుధ్యం, భద్రతా ఏర్పాట్లపై వారు క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తనిఖీ సందర్భంగా విద్యార్థినుల విశ్రాంతి గదులు, భోజనశాల, వంటగది, ఆహార నిల్వ గదులను పరిశీలించారు. బియ్యం, పప్పులు, నూనె, కూరగాయలు తదితర వంట సరుకుల నాణ్యతను తనిఖీ చేసి, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందుతున్నదా అనే విషయంపై ఆరా తీశారు. అలాగే మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, పరిశుభ్రత, విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అవసరమైన మెరుగుదలలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడిన మంత్రి కొండ సురేఖ, వసతి గృహంలో ఎదురవుతున్న సమస్యలు, అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థినులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వాతావరణం, సురక్షితమైన వసతి కల్పించడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ.. విద్యార్థినుల ఆరోగ్యం, విద్య, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. వసతి గృహాల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, మెరుగైన వసతి, పరిశుభ్రత, భద్రత కల్పించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యను అభ్యసించే పరిస్థితులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. తనిఖీ అనంతరం వసతి గృహ నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థినుల సంక్షేమానికి సంబంధించిన అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని అధికారులు, సిబ్బందికి మంత్రి, ప్రభుత్వ విప్ స్పష్టం చేశారు.



# గ్రామీణ విద్యార్థులకు జ్ఞానదీపం.. గ్రంథాలయం

- పంతంగిలో దివిస్ సిఎస్ఆర్ నిధులతో లైబ్రరీ ఏర్పాటు
- ప్రారంభించిన గ్రామ సర్పంచ్ కాకి శ్రీలత సుందర్

**తొలివెలుగు, చౌటుప్పల్ :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి గ్రామంలో దివిస్ కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో ఏర్పాటు చేసిన నూతన గ్రంథాలయాన్ని గురువారం గ్రామ సర్పంచ్ కాకి శ్రీలత సుందర్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో పుస్తక పఠన అలవాటు పెంపొందించడం, విజ్ఞానాన్ని విస్తరించడం, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు అవసరమైన అధ్యయన వాతావరణాన్ని కల్పించడమే ఈ గ్రంథాలయం ఏర్పాటు వెనుక ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాకి శ్రీలత సుందర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యా వనరులు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఈ గ్రంథాలయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, పుస్తక పఠనం ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానం, ఆలోచనా శక్తి, వ్యక్తిత్వ వికాసం పెరుగుతాయని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ గ్రంథాలయం ఏర్పాటుకు సహకరించిన దివిస్ కంపెనీ యాజమాన్యానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని విద్యార్థులు, యువత ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం నాయకులు, విద్యార్థులు గ్రంథాలయాన్ని సందర్శించి అందుబాటులో ఉంచిన పుస్తకాలు, అధ్యయన సౌకర్యాలను పరిశీలించారు. గ్రామంలో విద్యా వికాసానికి ఈ గ్రంథాలయం కీలక కేంద్రంగా మారుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోయ సదానందం, గ్రామ కార్యదర్శి పద్మజ, దివిస్ కంపెనీ ప్రతినిధులు కిషోర్, గోపి, వెంకటేశ్వరరావు, వార్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.




# నీట్ లీకేజీపై భగ్గుమన్న కాంగ్రెస్

- కేంద్ర వైఖరికి నిరసనగా ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం
- నేతాజీ చౌరస్తాలో ఎగిసిన నిరసన జ్వాలలు



**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి :** నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారాన్ని నిరసిస్తూ, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై జరిగిన చర్యలను ఖండిస్తూ భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చౌరస్తాలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత్ లవ్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఉప్పునూతుల వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ, నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనతో దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై స్పష్టమైన సమాధానం చెప్పాలని, సంబంధిత మంత్రులు నైతిక బాధ్యత వహించాలని వారు పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. విద్యార్థులపై నమోదు చేసిన కేసులను బేషరతుగా వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న ప్రతిపక్ష నాయకులపై తీసుకుంటున్న చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన లోపాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పాక మల్లేష్ యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కాసుల అంజయ్య, మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గ్యార సందీప్, గ్రంథాలయ చైర్మన్ చింతకుంట్ల కృష్ణారెడ్డి, సర్పంచులు మచ్చ శ్రీనివాస్, మోట బాలకృష్ణ, బొక్క మల్లారెడ్డి, మునుకుంట్ల నరేష్, గీత మహేష్, గోరుగంటి సువర్ణ రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాస్, బీసీ నాయకుడు మక్తల రమేష్, కౌన్సిలర్ రావుల జంగయ్య, ఉప సర్పంచులు సంతోష్ యాదవ్, దాసరి నరసింహతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సినర్జీ కంపెనీలో మహిళా భద్రత అవగాహన సదస్సు

- ఆపదలో ఉంటే హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలి: సీఐ మన్మధ కుమార్
- సైబర్ నేరాలు, స్వీయ రక్షణపై మహిళలకు పోలీసుల అవగాహన



**తొలివెలుగు, చౌటుప్పల్ :** మహిళల భద్రత, హక్కులు, స్వీయ రక్షణపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని ధర్మోజీగూడెం గ్రామ పరిధిలోని సినర్జీ కంపెనీ ప్రాంగణంలో గురువారం మహిళల భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చౌటుప్పల్ సీఐ జి. మన్మధ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మన్మధ కుమార్ మాట్లాడుతూ.. మహిళలు ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండటంతో పాటు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని, మహిళల భద్రత కోసం ప్రభుత్వం అందుబాటులో ఉంచిన అత్యవసర హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. అలాగే మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు, సైబర్ నేరాల నుంచి ఎలా అప్రమత్తంగా ఉండాలి, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆన్‌లైన్ మోసాలను గుర్తించే విధానం వంటి అంశాలపై సవివరంగా అవగాహన కల్పించారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఓటీపీలు ఇతరులకు వెల్లడించవద్దని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు భద్రతకు సంబంధించిన పలు సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు. మహిళల భద్రత కోసం అవగాహన, ఆత్మవిశ్వాసం, సమయానికి పోలీసులను ఆశ్రయించడం ఎంతో అవసరమని సీఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, సినర్జీ కంపెనీ యాజమాన్యం, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్





# కామన్‌వెల్త్ గేమ్స్ ప్రారంభం.. లాన్ బౌల్స్‌లో భారత్ శుభారంభం

గ్లాస్కో వేదికగా కామన్వెల్త్ గేమ్స్ గురువారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. భారత్ తరఫున వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను, లవ్లీనా బొర్గొహైన్ ఫ్లాగ్ బేరర్స్‌గా వ్యవహరించారు. మువ్వన్నెల జెండాను చేతపట్టి వీరిద్దరు ముందు నడవగా, వారిని భారత జట్టు అనుసరించింది. ఇక గేమ్స్ ప్రారంభానికి ముందే బాక్సర్ లవ్లీనా భారత్‌కు పతకం ఖాయం చేయగా, లాన్ బౌల్స్ గేమ్‌లో భారత్ శుభారంభం చేసింది. లాన్ బౌల్స్ మహిళల పెయిర్స్ ఈవెంట్‌లో భారత్ తొలి రౌండ్‌లో విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన పోరులో భారత జోడీ రూపా రాణి--పింకీ 'టైబ్రేక్'లో మాల్టాను ఓడించింది. తొలి సెట్‌ను భారత్ 7--1, రెండో సెట్‌ను మాల్టా 4--3తో గెలుచుకోవడంతో టైబ్రేక్ అనివార్యమైంది. చివరి బౌల్‌లో రాణించి పింకీ జట్టును గెలిపించింది. పురుషుల సింగిల్స్‌లో భారత ప్లేయర్ పుతుల్ సోనోవాల్ 5--4, 3--7, 1--0తో 'టైబ్రేక్'లో 2023 ప్రపంచ చాంపియన్ రియాన్ బెస్టెర్ (కెనడా)పై సంచలన విజయం సాధించాడు. డోపింగ్‌లో పట్టుబడటంతో భారత జూడో క్రీడాకారుడు అరుణ్ కుమార్ కామన్వెల్త్ క్రీడలకు దూరమయ్యాడు. 73 కేజీల విభాగంలో అతను బరిలోకి దిగాల్సి ఉంది. అయితే ఇటీవల నిర్వహించిన డోపింగ్ పరీక్షలో అతను నిషేధిత ఉత్ప?ప్రేరకం వాడాడని తేలడంతో జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) అరుణ్‌పై తాత్కాలిక నిషేధం విధించింది. దాంతో గ్లాస్గోకు వెళ్లాల్సిన భారత టీమ్ నుంచి అతడిని తప్పించారు. ఇక వెయిట్‌లిఫ్టింగ్‌లో పలువురు ఆటగాళ్లు డోపింగ్ నిబంధనలు ఉల్లఘించడంతో భారత్‌కు కేటాయించిన కోటాను 16 నుంచి 11కు తగ్గిస్తూ కామన్‌వెల్త్ క్రీడల నిర్వాహక మండలి నిర్ణయం తీసుకుంది. అజిత్ (71 కేజీలు), సాయిరాజ్ పరదేశి (88 కేజీలు), హర్‌చరణ్ సింగ్ (110 కేజీలు), వంశితా వర్మ (86 కేజీలు) డోపింగ్ నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలింది.

# తొలి టీ20లో జింబాబ్వేపై భారత్ ఘనవిజయం




హరారే: వరుసగా రెండు సిరీస్ ఓటముల తర్వాత భారత టీ20 జట్టు ఎట్టకేలకు గెలుపు బాట పట్టింది. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా గురువారం హరారే వేదికగా జరిగిన తొలి పోరులో భారత్ 7 వికెట్ల తేడాతో ఆతిథ్య జట్టును చిత్తు చేసింది. తద్వారా ఈ ఫార్మాట్‌లో ఏడు ఓటముల తర్వాత గెలుపు రుచిని ఆస్వాదించింది. జింబాబ్వే నిర్దేశించిన 126 పరుగుల స్వల్ప ఛేదనలో వైభవ్ సూర్యవంశీ (19 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 50) మెరుపులకు తోడు ఇషాన్ కిషన్ (35) రాణించడంతో భారత్.. 13.2 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఈ విజయంతో రెండు నెలల క్రితం భారత టీ20 సారథ్య పగ్గాలు అందుకున్న అయ్యర్ టీమిండియా సారథిగా తొలి విజయాన్ని అందుకున్నాడు. తొలుత భారత బౌలర్లు కట్టడిచేయడంతో జింబాబ్వే 125/7 స్కోరు మాత్రమే చేసింది. వెస్లీ మధెవెరె (34 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 39) టాప్ స్కోరర్. బంతితో రాణించిన మయాంక్ (2/18)కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఇరుజట్ల మధ్య శనివారం రెండో టీ20 జరుగుతుంది.

**వైభవ్ 'తొలి' ధనాధన్**

ఐపీఎల్‌లో సంచలన ప్రదర్శనతో జాతీయ జట్టులోకి వచ్చిన వైభవ్.. ఇంగ్లండ్ సిరీస్‌లో నిరాశపరిచినా తనకు అచ్చొచ్చిన హరారే పిచ్‌పై జింబాబ్వే బౌలర్లపై పిడుగులా విరుచుకుపడ్డాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇక్కడే జరిగిన అండర్-19 వన్డే ప్రపంచకప్ ఫైనల్ (80 బంతుల్లో 175 రన్స్‌తో)లో దుమ్మురేపిన వైభవ్.. ఫస్ట్ టీ20లో అదే జోరును కొనసాగించాడు. ఎంగరవ వేసిన రెండో ఓవర్లోనే రెండు సిక్స్‌లు, బౌండరీతో 20 రన్స్ దండుకున్నాడు. అభిషేక్ (1) విఫలమైనా వన్‌డౌన్ బ్యాటర్ ఇషాన్‌తో కలిసి స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. ఎవాన్స్ బౌలింగ్‌లో 4,6 బాదిన ఈ బీహార్ చిన్నోడు.. ముజరబాని 5వ ఓవర్లో ఒక సిక్స్, రెండు ఫోర్లు దంచాడు. మరో ఎండ్‌లో ఇషాన్.. న్యామహురీ ఓవర్లో మూడు బౌండరీలు బాదాడు. పవర్ ప్లే తర్వాత ఎంగరవ విసిరిన ఓవర్లో మొదటి బంతికి రెండు రన్స్ తీసి 18 బంతుల్లో అర్ధశతకం పూర్తిచేసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అతడికి ఇదే తొలి ఫిఫ్టీ. అయితే ఆ తర్వాతి బంతికే అతడు నిష్క్రమించాడు. వైభవ్ ఔటైనా శ్రేయస్ (28 నాటౌట్)తో కలిసి మూడో వికెట్‌కు 46 రన్స్ జోడించిన ఇషాన్ విజయానికి 12 పరుగుల దూరంలో పెవిలియన్ చేరాడు. అయితే కెప్టెన్ శ్రేయస్, వైస్ కెప్టెన్ తిలక్ వర్మ (6 నాటౌట్) లాంఛనాన్ని ముగించారు.

**పేసర్ల కట్టడితో..**

అంతకుముందు మొదట బ్యాటింగ్ చేసిన జింబాబ్వే భారత యువ పేసర్ల ధాటికి తొలి బంతి నుంచే విలవిల్లాడింది. రీఎంట్రీలో మయాంక్ ఫస్ట్ బాల్‌కే బెనెట్ (0)ను ఔట్ చేసి వికెట్ల ఖాతా తెరిచాడు. ప్రిన్స్, అరంగేట్ర పేసర్ అశోక్ శర్మ లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేయడంతో ఆతిథ్య జట్టు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. 7 ఓవర్లకు 31/3తో నిలిచిన జింబాబ్వే.. ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. ఆదుకుంటాడనుకున్న సారథి సికందర్ రజా (4)ను దూబే పెవిలియన్‌కు పంపా డు. బర్ల్ (26), మరుమణి (27) సాయంతో మధెవెరె ఆదుకోవడంతో జింబాబ్వే ఆమాత్రం స్కోరైనా సాధించింది.

**సంక్షిప్త స్కోర్లు**

జింబాబ్వే: 20 ఓవర్లకు 125/7 (మధెవెరె 39, బర్ల్ 26, మయాంక్ 2/18, ప్రిన్స్ 2/19):
భారత్: 13.2 ఓవర్లకు 126/3 (వైభవ్ 50, ఇషాన్ 35, ముజరబాని 2/26, ఎంగరవ 1/30)..

# విద్యార్థుల నిరసన.. నాన్న మాటలు గుర్తు చేసుకున్న సచిన్

నీట్ పేపర్ లీక్‌పై దేశవ్యాప్తంగా ఆగ్రహం రాజుకుంటోంది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసన తీవ్రరూపం దాల్చింది. ఢిల్లీ నుంచి కాకుండా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో జంతర్‌మంతర్‌కు తరలివస్తూ ఆందోళనలకు మద్దతు తెలుపుతున్నారు. ఈ క్రమంలో ఢిల్లీ పోలీసులు లాఠాచార్జ్ చేసినప్పటికీ విద్యార్థులు ఏమాత్రం బెదరకుండా తమ నిరసనను వ్యక్తం చేస్తూనే ఉన్నారు. విద్యార్థుల ఆందోళనకు ప్రముఖుల మద్దతు కూడా పెరుగుతూ వస్తోంది . తాజాగా భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ విద్యార్థుల నిరసనలకు మద్దతు పలికాడు. ఎంతో కష్టపడి చదివినా ఫలితం దక్కనప్పుడు విద్యార్థులు ఆవేదన చెందడం అర్థం చేసుకోదగిన అంశమేనని పేర్కొన్నాడు. విద్యార్థులు మరోసారి ఇలా నిరాశకు లోనవ్వకుండా చూసే బాధ్యత సమాజంపై ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు సచిన్ గురువారం రాత్రి 'ఎక్స్'లో పోస్టు చేశాడు. స్వతహాగా తన తండ్రి ప్రొఫెసర్ కావడంతో చిన్నప్పుడే తనకు నూరి పోసిన మాటలను సచిన్ మరోసారి గుర్తుచేసుకున్నాడు. 'ఓటములు ఎదురైనా పర్వాలేదు, కానీ మోసం మాత్రం చేయకూడదు. విజయం కోసం ఎప్పుడూ అడ్డదారులు తొక్కవద్దని మా నాన్న నాకు చెప్పేవారు. సమాజంలో పెద్దలుగా, మన సంస్కృతిని సరైన మార్గంలో తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

